పేదింటి ఉద్యోగ కుసుమాలు

- ప్రభుత్వ కొలువుల్లో మట్టిబిడ్డలు 7
- కష్టాలనే మెట్లుగా చేసుకుని ముందుకు..
- పరాజయమే పాఠాలుగా నేర్చుకుని విజయం



పసుపు పూసి సన్నని మంటపై కాల్చి.. ముక్కలు చేసి.. మసాలాలు దట్టించి.. తగినంత ఉప్పు, కారం తగిలించి వండిన నాటుకోడి పులుసును చూస్తేనే.. ఆహా.. నోరూరిపోవాల్సిందే. బ్రాయిలర్ కోడితో పోల్చితే ఈ నాటు కోడి మాంసం రుచే వేరు. ఎక్కువ మాంసకృతులు, తక్కువ కొవ్వు కలిగి సులభంగా జీర్ణమయ్యే ఈ మాంసానికి ఇటీవల డిమాండ్ పెరుగుతోంది. మాంసం మార్కెట్లలో, చికెన్ సెంటర్‌లలో అందుబాటులో ఉంచడమే ఆలస్యం మాంసంప్రియులు అందుకుపోతున్నారు. గిరాకీ ఉండడంతో ఇటీవల పల్లెవాసులు నాటుకోళ్ల పెంపకాన్ని చేపట్టి లాభాలను ఆర్జిస్తున్నారు.



నాటు..నాటు దొరకడమే లేటు!

- పెరిగిన నాటు కోళ్ల వినియోగం
- రుచికి ఫిదా అవుతున్న మాంసప్రియులు
- రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్
- పొలాలు, పెరట్లలో పెంపకం

సండే స్పెషల్ Sunday Special

అక్కన్నపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఎప్పుడో పండుగల వేళ మాత్రమే నాటు కోడి మాంసాన్ని వండుకునే తినే వారు. ఆదివారం పూట, సాధారణ రోజుల్లో మాంసం తినాలనిపిస్తే అందుబాటులో లభించే బ్రాయిలర్ కోడి చికెన్‌ను ఎక్కువగా తినేవారు. ఇటీవల కాలంలో నాటుకోడి రుచిని సైతం ఆస్వాదించేందుకు మాంసంప్రియులు ఇష్టపడుతున్నారు. అయితే, గతంలో ఈ నాటుకోళ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉండేది కాదు. ఇటీవల ప్రతీ ఆదివారమూ, దావత్‌లు, ఇంటికి అతిథులు వచ్చినప్పుడు, పెద్దవారికి తినాలనిపించినప్పుడు ఇలా ప్రతీ చిన్న సందర్భంలోనూ నాటు కోడి మాంసం వండేస్తున్నారు. దీంతో డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో సాధారణ రోజుల్లోనూ ఈ నాటు కోడి మాంసానికి గిరాకీ విపరీతంగా ఉంటుంది. దీనికి తగినట్లు ఉత్పత్తి పెరగాల్సిన అవసరముంది. డిమాండ్ దృష్ట్యా పల్లెల్లోని రైతులు తమ పెరట్లలో, పొలాల వద్ద, కొట్టాలలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న స్థలాల్లో నాటు కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. గతంలో మటన్ ధరకు సమానంగా వీటి ధర ఉండగా, ఉత్పత్తి పెరగుతుండటంతో ప్రస్తుతం కాస్త తక్కువకే లభిస్తుండడంతో నాటు కోడి మాంసాన్ని ఎప్పుడంటే అప్పుడు ఆరగించేస్తున్నారు.



అక్కన్నపేట మండలం కుందనవానిపల్లిలో పెంచుతున్న నాటుకోళ్లు

యమ రుచిగా..

గ్రామీణ ప్రాంతాల్లో పొలాల వద్ద, పెరట్లలో పెంచే నాటు కోళ్ల మాంసం యమ రుచిగా ఉంటుంది. ప్రకృతి సిద్ధంగా పెరగడంతో వాటికి ఈ రుచి వస్తుంది. నాటుకోడి కాళ్లు, ఎముకలు బలిష్టంగా ఉంటాయి. ఎక్కువ సమయం

మిగతా 7వ పేజీలో

నాలుగు నెలల సమయం

పెరటి కోళ్లుగా పిలిచే నాటు కోళ్ల పెంపకం సులువైనదే. పెద్దగా సాంకేతికత అవసరం లేదు. వ్యాధుల బెడద తక్కువగా ఉంటుంది. చిన్న స్థలం ఉంటే చాలు. జత కోళ్లతో ఏడాదిలో గుంపును తయారు చేయవచ్చు. పైగా పెట్టుబడి తక్కువగా ఉంటుంది. వృథా ఆహార పదార్థాలు, పొలాల్లోని కలుపు మొక్కలను, చెట్ల పొదల్లోని పురుగులను ఏరుకుని తింటాయి. నాటు కోళ్ల పెంపకం ద్వారా ఎరువు కూడా లభిస్తుంది. పెరటి కోళ్లు గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతాయి. కోడిపిల్లలను పెంచే తత్వం, శత్రువుల నుంచి సులభంగా తప్పించుకునే అలవాటు ఉంటుంది. నాలుగు నెలల్లో కోడిపెట్ట 2 కిలోలు, కోడిపుంజు 3 కిలోల మేర పెరుగుతుంది.

ఫిట్‌గా ఉండండి.. పరేడ్ చేయండి.

కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు సంగారెడ్డి పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం వీక్లీ పెరేడ్ నిర్వహించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ హాజరై పరిశీలించి సూచనలు చేశారు. శారీరకంగా, మానసికంగా ఫిట్‌గా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలమని పేర్కొన్నారు.

-సంగారెడ్డి క్రైం, నవంబరు 30



వార్డుల్లో సమస్యలపై నిలదీత

- చేస్తాం సార్.. చేస్తాం..
- అధికారుల సమాధానం!
- మండిపడిన కౌన్సిలర్లు
- పద్ధతి కాదని చైర్మన్ ఆగ్రహం

8



ఇది దేవాలయం..

- 18 మంది చిన్నారులకు
- గుండె ఆపరేషన్లు
- భావోద్వేగంతో కంటతడి పెట్టిన
- పిల్లల తల్లిదండ్రులు

7



ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ఎదుట పెద్దచెరువు

ముంపు బాధితుల ఆందోళన



సంగారెడ్డిలోని నీటి పారుదల శాఖ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు

సంగారెడ్డి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు సంగారెడ్డిలోని నీటి పారుదలశాఖ ఈఈ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఎస్ఈ ఏసయ్య, ఈఈ భీమ్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ చెరువు ఎగువన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, దిగువన ఆయకట్టు లేకపోయినా అధికారులు అత్యుత్సాహంతో తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 40 ఏళ్ల క్రితం 5వేల మంది లక్షల రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేశారని, ప్రస్తుతం అవన్నీ ముంపునకు గురవుతున్నాయని వాపోయారు. చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి, ఆమేరకు నీటిని కిందికి వదిలి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం 21 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు కానీ, పాలకులు కానీ పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు హైడ్రా అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ విషయంపై త్వరలో సీఎంను కలిసి విన్నవించుకుంటామని సత్యనారాయణ తెలిపారు. ఆందోళన కార్యక్రమంలో అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులు సంజయ్‌కుమార్, పుండరీకాక్షశర్మ, రాంబాబు, సురేష్, పూర్ణచందర్ రావు రామారావు, విజయకుమార్‌రెడ్డి, టీవీరావు, నాగభూషణం, ఈశ్వర్‌రావు, ఎంఎస్ బాబు, సత్యమూర్తి, రంగరాజు, రామకృష్ణ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

'ఫ్లెక్సీల వార్'పై

కలెక్టర్ సీరియస్

- మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. 'ఫ్లెక్సీల వార్.. జనం బేజార్' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు స్పందించారు. సంగారెడ్డి పట్టణంలోని రహదారుల బంగ్లా వద్ద గురువారం ఉదయం ఓ ఫ్లెక్సీ విరిగిపోయి వాహనదారుడిపై పడటంతో అతను తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ విషయమై సీరియస్ అయిన జిల్లా కలెక్టర్ క్రాంతి మున్సిపల్ కమిషనర్ సురేష్ పవార్‌కు శనివారం నోటీసులు జారీ చేశారు. పట్టణంలో ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి పట్టణంలోని ఐబీ వద్ద, ఆయా కూడళ్లలో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. ఇకపై అనుమతి లేకుండా పట్టణంలో ఎక్కడా ఫ్లెక్సీలు, కటౌట్లు పెట్టరాదని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనలు అమలయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.



- 18 మంది వైద్యులకు ఉన్నది ముగ్గురే
- స్పెషలిస్టులు రాక తగ్గిన రోగులు
- గైనకాలజిస్ట్ లేక ప్రైవేటులో ప్రసవాలు
- రూ. 5 కోట్లతో నిర్మించినా నెరవేరని లక్ష్యం

కార్పొరేట్ వసతులు.. కానరాని డాక్టర్లు

రామాయంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ తరహా హంగులు, ఆధునిక వసతులు కలిగిన రామాయంపేట పెద్దాసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందించలేకపోతోంది. రెండేళ్ల క్రితం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉన్న ఈ ఆసుత్రిని ప్రభుత్వం వైద్య విధాన పరిషత్‌లో చేర్చింది. దీనివల్ల మెరుగైన వైద్యం అందుతుందని ఆశించినా వైద్యుల్లేక రోజురోజుకూ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గిపోతుంది. గైనకాలజిస్టు లేకపోవడంతో గర్భిణులు ప్రసవాల కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.

అధునాతన భవనం

రామాయంపేట పట్టణంలో 2016లో పాత ఆస్పత్రిని కూల్చివేసి రూ. 5 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రిని నిర్మించారు. కార్పొరేట్ తరహాలో హంగులతో నూతన భవనాన్ని నిర్మించారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రిని అట్టహాసంగా ప్రారంభించారు. అధునాతన వసతులతో ల్యాబ్, ఐసీయూ, ఎక్స్‌రే, ఆక్సిజన్ మిషన్లు ఏర్పాటు చేశారు. కానీ, డాక్టర్ పోస్టులను మాత్రం భర్తీ చేయలేదు. ఆస్పత్రిలో 18 మంది డాక్టర్లు ఉండాల్సినా కేవలం ముగ్గురు ఎంబీబీఎస్, ఒక డెంటల్ డాక్టర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.

ప్రత్యేక సేవలు కరువు

ఆస్పత్రిలో స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేక మెరుగైన వైద్యం అవసరమైన రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తున్నది. గైనకాలజిస్ట్ లేక ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. పట్టణం మీదుగానే హైవే వెళ్తుండటంతో రోడ్డు ప్రమాదాల బాధితులను వైద్యం కోసం ఇక్కడికి తీసుకువస్తుంటారు. స్పెషలిస్టు డాక్టర్లు లేక రోగులకు ప్రాథమిక చికిత్స చేసి హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు పంపిస్తున్నారు. ఆరు మండలాల పరిధిలో ఉన్న ఆసుపత్రిలో వైద్యుల కొరత కారణంగా

మిగతా 8వ పేజీలో..

నిధులున్నా.. పట్టాలెక్కని పనులు

- సంగారెడ్డి జిల్లాలో 188 పనులకు రూ.441 కోట్లు
- రెండేళ్లుగా పెండింగ్‌లో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు
- పనులు చేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు

సంగారెడ్డి టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో రెండేళ్లుగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇందుకోసం ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ (ఎఫ్‌డీఆర్) నిధులు మంజూరైనా పనులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దీంతో రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. రెండు సంవత్సరాలుగా వర్షాలకు జిల్లావ్యాప్తంగా 188 దారహదారులు దెబ్బతినట్లు గుర్తించి మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. రోడ్లను బాగు చేయడం కోసం ప్రభుత్వం ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్ కింద రూ.411 కోట్లు మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 159 రోడ్ల మరమ్మతు పనులకు రూ.438 కోట్లు, ఈ ఏడాది 29 పనుల కోసం రూ.3 కోట్లు ఇచ్చింది. నిధులు మంజూరయినప్పటికీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని గుత్తేదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పనులు చేపట్టామని, వాటికి బిల్లులు ఇస్తేనే ఎఫ్‌డీఆర్ పనులు చేపడుతామని అధికారులకు తేల్చిచెప్పినట్లు తెలిసింది.



కంకర తేలిన గొల్లపల్లి-మహ్మదాపూర్-కోనాపూర్ రోడ్డు

ఈ రోడ్లపై ప్రయాణం నరకం

వర్షాలకు రహదారులు అధ్వానంగా మారడంతో మరమ్మతులు లేక రాకపోకలు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందోలు మండలం డాకూరు మీదుగా కొడెకల్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి, పుల్కల్, అందోలు మండలాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు చాలాచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ వరకు ఆరున్నర కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. నారాయణఖేడ్ నుండి మనూరు, నాగలగిద్ద మండలాల్లోని పలు గ్రామాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్లే రహదారులపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేపట్టకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వట్‌పల్లి, మునిపల్లి, పుల్కల్, హత్నూర, కొండాపూర్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, ఝరాసంగం, సదాశివపేట, రాయికోడ్, కంగ్టి, కల్హేర్, కంది మండలాల పరిధిలో చాలా రోడ్లు అధ్వాన్నంగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



మర్వెల్లి-బిజిలీపూర్ గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి (ఫైల్)

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో 'సైన్స్' కేంద్రం

పుల్‌కల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ప్రతిష్ఠాత్మక 'సైన్స్' కేంద్రం ఏర్పాటు కానున్నది. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం జీవో నంబర్ 151ను విడుదల చేసింది. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో అండర్ కేటగిరీ-3 టైప్ 'బీ'లో భాగంగా రూ.6.65 కోట్లతో సైన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నది. ఈ సైన్స్ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత, విజ్ఞానాన్ని ప్రదర్శించడానికి, కొత్త వేదిక ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక విద్యా శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాల క్యాంపస్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ రంగాలలో ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి సైన్స్ కేంద్రం ఎంతో దోహదపడనుంది. దీంతో పాటుగా సైన్స్ ఎగ్జిబిషన్‌లు, సైన్స్‌కాంపిటీషన్లు, డిబేట్స్, క్విజ్ పోటీలు, సెమినార్లు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి వేదిక కానున్నది.



నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు శనివారం నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, యాదాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో చలి కాస్త తగ్గింది. గత వారం రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుండగా శుక్రవారం రాత్రి మాత్రం ఏకంగా ఐదారు డిగ్రీల మేరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి.

క్షిపణుల తయారీలో భారత్ నంబర్ వన్

సాంకేతిక ప్రగతి, డీఆర్డీవోకు సహకారంలో నిట్ పాత్ర కీలకం

వరంగల్ నిట్ స్నాతకోత్సవంలో డీఆర్‌డీవో చైర్మన్ కామత్

హనుమకొండ, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): క్షిపణుల తయారీ రంగంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ విభాగం అత్యంత శక్తిమంతంగా మారిందని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వీ కామత్ అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీ య ఇంజనీరింగ్ కాలేజీ స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. అగ్ని, పృథ్వి, ఆకాశ్ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధవిమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాకలాంటి సాయుధ సంపత్తిని డీఆర్‌డీవోనే తయారు చేసిందన్నారు. వీటన్నింటి వల్లనే దేశ రక్షణ రంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకుంటూ ఉండాలని చెప్పారు. అంతకు ముందు కామత్ నిట్‌లో ఇన్‌స్టిట్యూట్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ అధ్యక్షత వహించారు. నిట్ సాధించిన ప్రగతిని వివరించారు. ఈ స్నాతకోత్సవంలో 1,875 మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. ఇందులో 10మంది విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సారి నిట్ గోల్డ్ మెడల్ విజేతగా మంజిమా కర్మాకర్ (ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) నిలిచారు.

సరూర్‌నగర్ స్టేడియంలో 6న బీజేపీ భారీ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక?

బీఆర్ఎస్ నోటిఫికేషన్లకు కాంగ్రెస్ కొలువులు

ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు

బీఆర్ఎస్‌లాగే కాంగ్రెస్ పాలన: కిషన్‌రెడ్డి

సర్కారు వైఫల్యాలపై నేటి నుంచి నిరసనలు


హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నమూనా

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 6న సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సర్కారు వైఫల్యాలపై ఆదివారం నుంచి బీజేపీ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలుపై ఆదివారం చార్జ్‌షీట్ విడుదల చేయనుంది. రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం ఉంటుంది. 2, 3, 4 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు, సదస్సులు, పాదయాత్రలు నిర్వహించనున్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కారు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చింది తప్ప.. ఒక్క కొత్త నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఏడాదిలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పంచాయతీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ సర్కారులు ఒక్క పైసా ఇవ్వలేదని అన్నారు. రుణమాఫీ కూడా అరకొరగా చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలోని అహంకారం, నియంతృత్వం, అవినీతి, వైఫల్యాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఏ వర్గమూ సంతోషంగా లేదని.. రాష్ట్ర ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యమబాట పట్టాలని పార్టీ నాయకులకు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని, కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగట్టాలని ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు.

రూ.26 కోట్లతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్ర జ్యోతి): హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.6 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన రైల్వేస్టేషన్ ప్రతిపాదిత డిజైన్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పన వల్ల రైల్వే స్టేషన్ అత్యాధునిక రవాణా కేంద్రంగా మారుతుందని తెలిపారు.

సభ్యత్వ నమోదుపై బన్సల్ క్లాస్..

బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 20వేల క్రియాశీల సభ్యత్వాలు అయ్యాయని.. ఇంకా 30 వేలు చేయించాల్సిందేనని స్పష్టం చేశారు. సభ్యత్వాలు చేయించని వారికి పార్టీ పదవులు ఎందుకని ప్రశ్నించారు. "సభ్యత్వ నమోదు మొదలు ప్రతీ పార్టీ కార్యక్రమాలకు తెలంగాణ నేతలు సడలింపులు కోరతారు. యూపీ కంటే ఇక్కడ కులపిచ్చి ఎక్కువ. అధికారంలోకి రావాలంటే సంస్థాగత బలోపేతం అత్యంత కీలకం. హరియాణా, మహారాష్ట్ర రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం" అని స్పష్టం చేశారు.


వైసీపీ నేతల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు

పులివెందుల వైసీపీ నేతల చెరవీడిన తెలంగాణ కార్లు

- ఏపీ మంత్రి లోకేష్ చొరవ.. సంగారెడ్డి వాసి సతీష్‌కు ఊరట
- ఇతడి సంస్థ నుంచి లీజుకు తీసుకున్న వికారాబాద్ వాసి
- అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులకు బాడుగకు
- సతీష్‌కు అద్దె చెల్లించని వికారాబాద్ యువకుడు మణిరాజ్
- అడిగినందుకు చంపేస్తామని బెదిరింపులు.. చిత్రహింసలు
- ఏపీ ఆదేశాలతో స్వాధీనం చేసుకున్న తెలంగాణ పోలీసులు


బాధితుడు సతీష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, నవంబరు 30: గత మూడేళ్లుగా పులివెందుల వైసీపీ నాయకుల చెరలో ఉన్న తెలంగాణ వ్యక్తికి చెందిన ఆరు కార్లకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో మోక్షం లభించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సతీష్‌కుమార్ హరిహర కార్ రెంటల్ పేరిట సంస్థను నడుపుతున్నాడు. వికారాబాద్ వాసి మణిరాజ్ 2021 ఏప్రిల్‌లో ఆరు కార్లను అద్దెకు తీసుకున్నాడు. 4 నెలల పాటు డబ్బు చెల్లించ లేదు. ఎంత వెదికినా ఫలితం లేకపోవడంతో 2023 జనవరిలో సతీష్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిరాజ్‌ను ఓ మోసం కేసులో సైబరాబాద్ పరిధి జీడిమెట్ల పోలీసులు నిరుడు జూలై 5న అరెస్ట్ చేశారు. సతీష్ ఫిర్యాదుతో పీటీ వారెంట్‌పై సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా తాను తీసుకున్న కార్లలో కొన్ని పులివెందుల వైద్య కళాశాలలో లీజుకు నడుస్తున్నాయని, మరికొన్ని వైసీపీ నేతల వద్ద ఉన్నాయని మణిరాజ్ తెలిపాడు. దీంతో సతీష్ వాహనాల గురించి వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై వైసీపీ నేతలతో మాట్లాడుదామని వేంపల్లె పోలీసులు తీసుకెళ్లగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అనుచరులు వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిలు సతీష్‌ను తీవ్రంగా కొట్టారు. కార్లు అడిగితే చంపుతామని బెదిరించారు. ఇడుపులపాయలోని గదిలో ఐదు రోజులు బంధించి చిత్రహింసలు పెట్టారు. చంపేందుకు కుట్ర పన్నారు. ఏపీలో ప్రభుత్వం మారడంతో ఇటీవల సతీష్ మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రులు, నేతలను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. సోషల్ మీడియాలో ఏపీ మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లాడు. జనసేన నేతలకు కూడా తెలిపాడు. ఆయన ఆదేశాలతో ఏపీ పోలీసులు.. ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరుల వద్ద ఉన్న కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీసులు వాటిని తీసుకువచ్చారు. కార్లను కోర్టులో ప్రవేశపెడతామని సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. 2021 నుంచి ఎంపీ అవినాష్‌రెడ్డి అనుచరులు తన కార్లను దౌర్జన్యంగా వాడుకున్నారని సతీష్ చెప్పాడు. వేంపల్లె పోలీసులు గతంలో వైసీపీ నేతలకే మద్దతు పలికినట్లు ఆరోపించాడు. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి వైసీపీ నేతల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, తన ప్రాణానికి ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. తనను మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

2 నుంచి సాయంకాలం బీటెక్ తరగతులు ప్రారంభం

- జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సాయంకాలం బీటెక్‌లో ప్రవేశాలు పొందిన వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు డిసెంబరు 2 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు సమాచారమిచ్చినట్టు చెప్పారు. ఈవెనింగ్ బీటెక్ అకడమిక్ క్యాలెండర్‌ను ఆయన శనివారం విడుదల చేశారు. వర్సిటీలోని మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో ఈ ఏడాది నుంచి కొత్తగా ఈవెనింగ్ బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 4వరకు మొదటి సెమిస్టర్ కొనసాగుతుందని, సెకండ్ సెమిస్టర్ జూన్ 2న ప్రారంభమై అక్టోబరు 18తో ముగుస్తుందన్నారు. సాయంకాలం బీటెక్ రెండో సంవత్సరం తరగతులను 2025 నవంబరు 3 నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

అప్పులు తీర్చలేక పత్తి రైతు ఆత్మహత్య

- సిరిసిల్ల జిల్లా జవారిపేటలో ఘటన

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనిపించక పత్తిరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన రైతు కోమటి నాగరాజు (49) తనకున్న 4 ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ప్రతీ ఏటా నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనతో శనివారం పొలంలో పురుగు మందు తాగాడు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు.

23 ఏళ్లకే ఉద్యోగం సాధించా..



నాపేరు కుప్పల భవాని. మాది సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీ ఎర్రవల్లి గ్రామం. నా తల్లిదండ్రులు, శివకుమార్, నాగమణికి ఏకైక కూతురిని. గజ్వేల్‌లోని మంజీరా పాఠశాలలో పదో తరగతి వరకు, తిరుమలగిరిలో శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్, మేడ్చల్ జిల్లా గౌడవెల్లిలోని యశోద ప్రైవేట్ కాలేజీలో నర్సింగ్ కోర్సు పూర్తి చేశాను. మాది నిరుపేద కుటుంబం. మల్లన్నసాగర్ నిర్మాణంలో సర్వం కోల్పోవడంతో బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళ్లాం. మా నాన్న పడ్డ కష్టాలు చూసి చలించిపోయా. చదువుతోనే జీవితం మారుతుందని నమ్మి రాత్రింబవళ్లు కష్టపడి చదివా. ఏదైనా సాధించి అమ్మానాన్న కళ్లలో ఆనందం చూడాలనుకున్నా. రోజుకు 10 గంటలు చదివి కాంట్రాక్ట్ బేసిక్‌లో ఉద్యోగం సాధించా. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా విధులు నిర్వర్తిస్తూనే ప్రభుత్వం ఉద్యోగం కోసం ప్రిపేర్ అయ్యాను. ఇటీవల స్టాఫ్‌నర్స్‌గా ఉద్యోగం సాధించి ఉస్మానియా ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

2017లో ఒక్క మార్కుతో ఉద్యోగం కోల్పోయా..



నాపేరు బండారి అమరేందర్‌గౌడ్, గజ్వేల్‌లోని దిలాల్‌పూర్ గ్రామం. మా తల్లిదండ్రులు ఒక చిన్న హోటల్ నడుపుతూ నన్ను పై చదువులు చదివించారు. 2017 టీఆర్‌టీలో ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాను. బీఎడ్ పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తి కోసం పట్టు విడవకుండా నాలుగు సంవత్సరాలు చదివాను. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలో జోనల్ స్థాయిలో 20వ ర్యాంక్ సాధించాను. అలాగే డీఎస్సీ 2024లో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించి ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించాను. ప్రస్తుతం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాను. ఈ విజయానికి కారణమైన నా తల్లిదండ్రులకు, మమ్మల్ని ఎల్లవేళలా ప్రోత్సహించిన విన్నర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణసార్‌కు ధన్యవాదాలు.

పేదింటి ఉద్యోగ కుసుమాలు

- ప్రభుత్వ కొలువుల్లో మట్టిబిడ్డలు
- కష్టాలనే మెట్లుగా చేసుకుని ముందుకు..
- పరాజయమే పాఠాలుగా నేర్చుకుని విజయం

గజ్వేల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వారి తల్లిదండ్రులు అతి సామాన్యులు. రెక్కాడితేగానీ పూటగడవని పరిస్థితి వారి కుటుంబానిది. చదువుతోనే తమ కష్టాలు కడతేరుతాయని భావించి పట్టుదలతో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ కొలువే లక్ష్యంగా పోటీ పరీక్షలు రాసి పలుమార్లు పరాజయం చవిచూశారు. అయినా నిరాశ చెందకుండా ఎన్నో వ్యయాప్రయాసలకు ఓర్చి మరింత పట్టుదలతో ప్రయత్నించి విజయం సాధించి శభాష్ అనిపించారు గజ్వేల్ మండలానికి చెందిన కుప్పాల భవాని, గుండారం కళ్యాణి, అరిగే కమలాకర్, తాటిపాముల దినేష్, బండారి అమరేందర్‌గౌడ్. పేపర్‌లీకేజీలు, కోర్టు కేసులు ఇతరత్రా సమస్యలు ఎదురైనా సహనం కోల్పోకుండా పుస్తకాలను వదలలేదు. మట్టిలో మాణిక్యాల్లా మెరిసి వారి తల్లిదండ్రులు ముఖాల్లో వెలుగులు నింపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనం. అలాంటిది ఇందులో ఒకరు ఏకంగా మూడు ఉద్యోగాలు, మరొకరి రెండు ఉద్యోగాలు సాధించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, కష్టపడితే ఎప్పటికైనా ఫలితం దక్కుతుందని నిరూపించిన ఈ పేదింటి విద్యాకుసుమాల విజయ ప్రస్థానం వారి మాటల్లోనే.

భర్త ప్రోత్సాహంతోనే...



నాపేరు గుండారం కల్యాణి. మాది రిమ్మనగూడ గ్రామం. ఎస్ఏ తెలుగు ఉమెన్స్ ఓపెన్ కోటాలో ఒకటే పోస్టు ఉండటం.. జిల్లా మొదటి ర్యాంకు నాకే రావడం గర్వకారణంగా ఉంది. నేను 2012 డీఎస్సీలో ఎస్జీటీ, 2017లో టీఆర్టీ, గురుకులంలో టీజీటీ తెలుగులో 1:2 నిష్పత్తిలో ఉద్యోగం చేజారింది. ఇప్పుడు 2024 డీఎస్సీలో జిల్లాలోనే ఉమెన్స్ కోటాలో మొదటి ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. అన్నయ్యతో పాటు నా భర్త ప్రోత్సాహంతో బీఈడీ, పీజీ పూర్తిచేశాను. నేను విఫలమైనప్పుడల్లా వెన్నంటే ఉండి ఉద్యోగం సాధించేవరకు ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అత్తమామలు, భర్తకు రుణపడి ఉంటాను. రాయపోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాను.

మొదటి ప్రయత్నంలోనే సాధించా..



నేను తాటిపాముల దినేష్. గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామం. మా తల్లిదండ్రులు తాటిపాముల గంగారం, వనజలకు ముగ్గురం సంతానం. ఇందులో నేను చిన్నవాడిని. దురదృష్టవశాత్తు 2020లో అనారోగ్యంతో మా నాన్న మృతి చెందాడు. ఆ తరువాత మూడు నెలలకే అమ్మ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై మంచానికే పరిమితమైంది. 2019 సంవత్సరంలో ఓయూలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేశాను. 2020 నుంచి ఇంట్లో అమ్మను చూసుకుంటూనే సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నాను. విన్నర్ పబ్లికేషన్ ప్రసన్న హరికృష్ణ సార్ నా పరిస్థితిని చూసి ఉచిత కోచింగ్ ఇచ్చారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ 4 ఫలితాల్లో జిల్లాలో 32వ ర్యాంకుతో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాదించా. సివిల్స్ సాధించడమే నా లక్ష్యం.

మూడు ఉద్యోగాలు సాధించా...



నాపేరు అరిగే కమలాకర్. మాది సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామం. వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా తల్లిదండ్రులు నా చిన్నతనం నుంచి అనేక కష్టాలు పడుతూనే నన్ను చదివించారు. నేను ఉద్యోగం సాధిస్తేనే వాళ్ల కష్టాలు తీరుతాయని బలంగా నమ్మాను. రోజుకు ఎనిమిది గంటలు కష్టపడి చదివి తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మూడు ఉద్యోగాలు సాధించా. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పీజీటీగా, తెలంగాణ గురుకులంలో టీజీటీగా, తెలంగాణ డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా మూడు ఉద్యోగాలను సాధించాను. ప్రస్తుతం రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాను.



ఆందోళన చేస్తున్న సిర్గాపూర్ గ్రామస్తులు

108 అంబులెన్స్ కోసం ఆందోళన

కల్హేర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సిర్గాపూర్ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సిర్గాపూర్‌లో పోలీస్‌స్టేషన్, రౌండ్‌డి క్లాక్ ప్రభుత్వ ఆస్పత్రి, కేజీబీవీ, గిరిజన గురుకుల బాలికల కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రెండు బ్యాంకులు ఉండి అత్యధిక జనాభా కలిగి ఉన్నా అంబులెన్స్ సౌకర్యం లేకపోవడం విచారకరమన్నారు. దీంతో ప్రమాదాల సమయంలో సకాలంలో వైద్యం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిర్గాపూర్ నుంచి నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి చేరుకోవాలంటే 12 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. మారుమూల గిరిజన తండాలు అధికంగా ఉన్న సిర్గాపూర్ మండల కేంద్రంలో తక్షణమే 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ సిగ్రె, నాయకులు యాదవరావు, నర్సాగౌడ్, మహేందర్‌గౌడ్, అంజయ్య, యాదగిరి, సంతోష్‌రావు, చంద్రకాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌వాసికి ఉత్తమ అవార్డు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభివాదం చేస్తున్న మహేందర్

హుస్నాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన కొడముంజ మహేందర్‌కు బెస్ట్ గ్రామీణ వ్యవసాయ పారిశ్రామికవేత్త అవార్డు లభించింది. శనివారం హైదరాబాద్ టీ హబ్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. దళిత కుటుంబానికి చెందిన మహేందర్ గత కొన్ని సంవత్సరాలుగా ట్రాక్టర్ రోటావేటర్లు, వ్యవసాయం, దానికి అనుబంధ పనిముట్లు, ఫిట్‌నెస్ పరికరాలు తయారు చేస్తూ రైతులకు అందిస్తున్నారు. దీన్ని గుర్తించి ఈ అవార్డును ప్రధానం చేసినట్లు మహేందర్ తెలిపారు.

టీచర్ కొట్టడంతో విద్యార్థికి గాయాలు

జోగిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఓ టీచర్ విచక్షణరహితంగా కొట్టడంతో విద్యార్థి తలకు తీవ్రంగా గాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం పాఠశాలకు వచ్చిన విద్యార్థి తల్లిదండ్రుల ఎదుట సదరు టీచర్ పశ్చాత్తాప పడటంతో వారు కేసు పెట్టకుండా వదిలేశారు. దీనికి సంబంధించి బాధితుడి తండ్రి పాండు కథనం ప్రకారం.. అందోలు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన నీరుడి పాండు కుమారుడు విష్ణు అందోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాల సమయంలో ఓ టీచర్ పాఠం చెబుతుండగా, విష్ణు పక్కన కూర్చున్న తోటి విద్యార్థి కోరిక మేరకు అతడి కాలిపై నొప్పి మందు స్ప్రే చేస్తున్నాడు. దీనిని గమనించిన టీచర్ కోపంతో ఊగిపోతూ విష్ణు వద్దకు వచ్చి షర్ట్ పట్టుకుని లాగారు. దీంతో అతని షర్ట్ బటన్స్ ఊడిపోవడంతో పాటు, విద్యార్థి తల డెస్క్‌కు తగిలి తీవ్ర గాయమైంది. ఇతర ఉపాధ్యాయులు గమనించి విద్యార్థిని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించగా, తలకు నాలుగు కుట్లు పడ్డాయి. విద్యార్థి షర్ట్ మొత్తం రక్తంతో తడిచి పోగా, షర్ట్ పట్టి లాగిన టీచర్ సదరు షర్ట్‌ను పాఠశాల గ్రౌండ్‌లో తగులబెట్టించారు. అయితే, విషయం బాధిత విద్యార్థి తండ్రికి తెలిసి అతను, మరికొందరితో కలిసి వచ్చి టీచర్‌ను నిలదీయగా, క్లాస్‌లో కుదరుగా కూర్చొకపోతే దండించకుండా ఊరుకుంటారా అనడమేగాక.. తనకు పెద్ద పెద్ద రాజకీయ నాయకులు తెలుసు.. మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ దురుసుగా మాట్లాడినట్లు విద్యార్థి తండ్రి తెలిపారు. అధికారిక పనిపై సంగారెడ్డికి వెళ్లిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధిత విద్యార్థి తండ్రితో ఫోన్లో మాట్లాడి శనివారం తాను వచ్చాక మాట్లాడుతానని సర్ది చెప్పారు. శనివారం ఉదయమే ప్రధానోపాధ్యాయుడు, మరో ఉపాధ్యాయుడు బాధిత విద్యార్థి ఇంటికి వచ్చి పరామర్శించి, విద్యార్థిని, అతని తల్లిదండ్రులను పాఠశాలకు తీసుకెళ్లారు. ఈలోగా పలువురు తల్లిదండ్రులూ పాఠశాలకు వచ్చారు. ఎస్ఐ పాండు సైతం పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. అంతా కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఈలోగా ప్రధానోపాధ్యాయుడు.. ఇతర ఉపాధ్యాయులు సదరు టీచర్‌ను మందలించి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడని హెచ్చరించారు. విద్యార్థి తరఫున వారిని సముదాయించడంతో వారు కేసు పెట్టకుండా వెళ్లిపోయారు.

తెలంగాణను ఇచ్చిందే కాంగ్రెస్

- జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్

ఝరాసంగం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ, కానీ పదేళ్ల అనుభవించింది మాత్రం మరొకరిని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ప్యాలవరం వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ బ్రిడ్జి పనులకు రూ.3 కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయన్నారు. రానున్న వర్షాకాలం లోపు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. నిమ్జ్‌తో జహీరాబాద్ పారిశ్రామిక హబ్‌గా మారనుందన్నారు. ఝరాసంగంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ ప్యాలవరం బ్రిడ్జితో ఆ గ్రామ ప్రజల కష్టాలు తొలగిపోతాయన్నారు. నియోజకవర్గంలో రోడ్లు అధ్వాన్నంగా మారాయని, వాటి నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకర్, మాజీ ఎంపీపీ దేవిదాస్, కాంగ్రెస్ నాయకులు ముల్తానీ, శంకర్ పాటిల్ నరేష్ కుమార్, శేఖర్ పాటిల్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆపరేషన్ చేసుకున్న పిల్లలతో తల్లిదండ్రులు

ఇది దేవాలయం..

- 18 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు
- భావోద్వేగంతో కంటతడి పెట్టిన పిల్లల తల్లులు

కొండపాక, నవంబరు 30 : పసి గుండెకు చిల్లు పడిందంటే ఆ తల్లిదండ్రుల వేదన చెప్పరానిది. ఇక నిరుపేద కుటుంబంలో పుట్టిన పిల్లల పరిస్థితి మరీ దారుణం. గుండె సంబంధిత సమస్యలతో పుట్టిన ఎంతోమంది పేదింటి బిడ్డలు సకాలంలో చికిత్స అందక మృతిచెందుతున్నారు. దేశంలో సుమారుగా 2,48,000 వేల మంది చంటి బిడ్డలు గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. ఇందులో 60 వేల మందికి ఆపరేషన్లు అవసరంకాగా, దేశంలో కేవలం పదివేల మందికి సర్జరీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించడం కోసం సత్యసాయి సేవా సంస్థలు పలు ప్రాంతాల్లో చైల్డ్ కేర్ సెంటర్‌లను ప్రారంభించింది. మారుమూల ప్రాంతమైన కొండపాక ఆనంద నిలయం శివారులో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో కేవలం ఆరు రోజుల్లో డాక్టర్ల బృందం 18 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. దీంతో పిల్లల తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివిరిసింది. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి భావోద్వేగంతో కంటతడి పెట్టారు. కళాశాల చైర్మన్ శ్రీనివాస్, మాజీ మంత్రి హరీశ్‌రావు, కె.వి రమణాచారి ఆస్పత్రి ఏర్పాటు, గుండె ఆపరేషన్ల తదితర విషయాలు మాట్లాడుతున్న సమయంలో అక్కడున్న వారి అందరి కళ్లు చెమ్మగిల్లాయి. ప్రతి ఒక్కరూ ఏదో రకమైన సేవ చేయాలనే భావన వారిలో కలిగింది.

పిల్లలను పలకరించిన హరీశ్‌రావు

సంవత్సరం చిన్నారి నుంచి 10 సంవత్సరాల వయసున్న పిల్లలకు ఆపరేషన్లు విజయవంతంగా జరిగాయి. వారందరినీ మాజీ మంత్రి హరీశ్‌రావు దగ్గరికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి వద్దకు వెళ్లినప్పుడు ఆయన సంతోషం చెప్పరానిది. పసి హృదయాలు బాగుపడడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. లక్షలాది రూపాయలు వేతనం పొందే అవకాశాలున్నా మానవతా దృక్పథంతో సేవ చేస్తున్న డాక్టర్ అనగ, డాక్టర్ భూషణ్, డాక్టర్ అమితశర్మలను హరీష్‌రావు అభినందించారు.

కంటతడి పెట్టిన రాజేశ్వరి

చిన్న శంకరంపేటకు చెందిన రాజేశ్వరి కూతురు మనస్విని ఆపరేషన్ సక్సెస్ కావడంతో ఆమె మాట్లాడుతూ తాను చాలా ప్రాంతాలకు తిరిగానని, నీలోఫర్ ఆసుపత్రిలో ఇక్కడి ఆసుపత్రి సమాచారం తెలపడంతో వచ్చి చేరానని తెలిపింది. ఆపరేషన్ విజయవంతం కావడం తన బిడ్డకు మరో జన్మ అంటూ కంటతడి పెట్టింది. ఇది దేవాలయం అని అందులో తన బిడ్డకు ప్రాణం పోసిన డాక్టర్లు దేవుళ్లతో సమానమని ఏడ్చింది.

నా బిడ్డను డాక్టర్ చేస్తా..

ఇబ్రహీంపట్నం మండలం మంచాల గ్రామానికి చెందిన భాస్కర్, అరుణల కూతురు రక్షణకు గుండె ఆపరేషన్ విజయవంతమైంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా సమయానికి ఆపరేషన్ అయ్యేది కాదని, కానీ చిల్లి గవ్వ లేకుండా సత్యసాయి సంజీవని ఆస్పత్రిలో ఆపరేషన్ చేసిన వారు దేవుళ్లు అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, తన కూతుర్ని డాక్టర్‌ను చేస్తానని, లేకుంటే చివరకు కనీసం నర్సు గా తయారు చేసి వైద్య సేవలందించేలా చూస్తామని రక్షణ తల్లి తెలిపింది.

నాటు.. నాటు.. దొరకడమే లేటు!


ఐదో పేజీ తరువాయి

బయట నిల్వ ఉంచినా మాంసం పాడవదు. వండిన తర్వాత ఎముకలు నమిలేందుకు గట్టిగా ఉంటాయి. మటన్‌తో సమానంగా ఉడికించాల్సి వస్తుంది. చాలా మంది మాంసం ప్రియులు నాటుకోడి పులుసును విపరీతంగా ఇష్టపడతారు.

కిలో రూ.400కుపైగా

నాటుకోడి మాంసం మంచి రుచిగా, పోషక లక్షణాలు ఉండడంతో మాంసం ప్రియుల్లో మక్కువ పెరగడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఇటీవల వీటి ఉత్పత్తి పెరిగినా, డిమాండ్ మేరకు సరఫరా లేక మరీ అంతగా ధరలు తక్కువగా ఉండడం లేదు. గతంలో మేక, గొర్రె మాంసంతో సమానంగా నాటు కోడి ధర పలికేది. ప్రస్తుతం నాటుకోడి పెట్టకు కిలో రూ.400 నుంచి రూ.450, నాటు కోడిపుంజుకు కిలో రూ.500 నుంచి రూ.550 వరకు ధర పలుకుతుంది.






నాటు కోళ్ల పెంపకంతో మంచి లాభాలు

నా పొలం వద్దనే 150 నాటు కోళ్లు పెంచుతున్నాను. నాలుగు నెలలకు ఒకసారి 150 చొప్పున రెండు బ్యాచ్‌లను విక్రయించాను. ఒక్కో కోడి రెండు కిలోల నుంచి మూడు కిలోలకు వరకు రాగానే అమ్మకాలు చేపడతాను. కిలో రూ.400 నుంచి రూ.500 వరకు అమ్ముతూ ఉంటాను. చాలామంది పొలాల వద్దకు వచ్చే కొనుగోలు చేస్తూ ఉంటారు. ఆదివారం వచ్చిందంటే చాలు గిరాకీ బాగా ఉంటుంది. చాలామంది అడ్వాన్స్ ఇచ్చి కొనుగోలు చేస్తారు. నాటు కోళ్ల పెంపకంతో మంచి లాభాలు ఉన్నాయి.

- ఏలేటి కొండల్‌రెడ్డి, రైతు, కుందనవానిపల్లి, అక్కన్నపేట మండలం



ఖేడ్ మండలం అంత్వార్‌లో కళాజాత

ప్రజాపాలనపై కళాజాత

రామాయంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలన ఏడాది పూర్తికావొస్తున్న సందర్భంగా నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్, జడ్‌చెరువుతండా, నార్లాపూర్ గ్రామాలలో తెలంగాణ సాంస్కృతిక శాఖ శనివారం కళాజాత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు తమ ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సిద్ధులు, కారంగుల మాధవి, శివొల్ల కృష్ణ, జింక దేవదాసు, సందుర్ల శేఖర్, ఆస రామారావు, విజయలక్ష్మి, ఎల్లయ్య కమ్మరి నర్సయ్య రమేష్, లింగం పాల్గొన్నారు.

● నారాయణఖేడ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఖేడ్ మండలం అంత్వార్, రుద్రారం గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కళాకారులు శేఖర్‌గౌడ్, మదన్‌సింగ్, రవీందర్, శశిప్రియ, రాజు, స్వప్న, ఆగమయ్య సాయిలు కళా ప్రదర్శన నిర్వహించారు. ఏడాదికాలంలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తమ ఆటపాటల ద్వారా వివరించారు.

క్రైం కార్నర్

హత్యా.. ఆత్మహత్యా?

- వ్యక్తి మృతదేహం లభ్యం

చేర్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలకేంద్రం శివారులోని పద్మశ్రీ గార్డెన్స్ సమీపంలో శనివారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తలభాగం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి ఎస్ఐ రాజు చేరుకుని మృతదేహన్ని పరిశీలించి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడు చేర్యాల మండలం పాత దొమ్మాట గ్రామానికి చెందిన పొలోజు ఉపేంద్రాచారి(40)గా గుర్తించారు. వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉపేంద్రాచారి ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైనా హత్యచేశారా..? అనే అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్‌కు వెళ్లమన్నందుకు విద్యార్థి బలవన్మరణం



గోవింద్(ఫైల్)

చిలప్‌చెడ్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు వెళ్లమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గన్యాతండాకు చెందిన గోగ్లోత్ శివరామ్ కొడుకు గోవింద్ గౌతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. 15 రోజుల నుంచి స్కూల్‌కు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉన్నాడు. దీంతో శనివారం స్కూల్‌కు వెళ్లాలని తండ్రితో పాటు ఇతర కుటుంబీకులు గోవింద్‌కు సూచించారు. స్కూల్‌కు వెళ్లడం ఇష్టం లేని గోవింద్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే తలుపులు తీసి అతడిని కిందకు దింపగా అప్పటికే చనిపోయాడు. తండ్రి శివరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి మతిస్థిమితం లేని వ్యక్తి..



నవీన్(ఫైల్)

మిరుదొడ్డి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన నవీన్(30)కు అంగవైకల్యంతోపాటు మతిస్థిమితం సరిగాలేదు శుక్రవారం వాకింగ్‌కు వెళ్తున్నని ఇంట్లో చెప్పి వెళ్లి రెడ్డివారికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి ఎంతకీ తిరిగి రాకపోడంతో కుటుంబ సభ్యులు తప్పిపోయాడంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం గ్రామంలోని రెడ్డివారికుంటలో నవీన్ చెప్పులు దొరకడంతో కుంటలో గాలించగా నవీన్ మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులను నిర్లక్ష్యం చేయరాదు

- రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యులు



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుబ్బాక, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యులు జ్యోత్స్న, జీనత్ హెచ్చరించారు. శనివారం దుబ్బాక మండలంలోని హబ్షీపూర్ గ్రామంలో మహాత్మాజ్యోతిబాపులే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలోని బియ్యం, గుడ్ల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు తింటున్న అన్నాన్ని పరిశీలించారు. వారి వెంట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో ప్రభుదాస్, ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలపై నివేదిక ఇవ్వాలి : ఆర్డీవో

నర్సాపూర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్‌లో ట్రిబుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను తక్షణమే విచారించి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో మహిపాల్ సూచించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో నర్సాపూర్, శివ్వంపేట తహసీల్దార్లతో సమావేశమై రైతుల నుంచి వచ్చిన అభిప్రాయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ క్షేత్రస్థాయి విచారణలో నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో ట్రిబుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న వారి నుంచి 260 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. పరిహారం విషయంలో ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని, ప్రస్తుతం డాటా ఎంట్రీ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందన్నారు.

వార్డుల్లో సమస్యలపై నిలదీత

- చేస్తాం సార్.. చేస్తాం..!
- అధికారుల సమాధానంపై మండిపడిన కౌన్సిలర్లు
- గత కౌన్సిల్ సమస్యలు పరిష్కరించకపోవడంపై అసహనం
- ఇది పద్ధతి కాదంటూ ఆగ్రహించిన చైర్మన్ చంద్రపాల్



ఇంజనీరింగ్ అధికారులపై మండిపడుతున్న మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను గత సమావేశంలో ప్రస్తావించగా ఆరోజు చేస్తాం సార్.. అంటూ చెప్పిన అధికారులు మళ్లీ ఇప్పుడుకూడా చేస్తామంటూ సమాధానం ఇవ్వడం పట్ల కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే సమావేశం నిర్వహిస్తామని, అటువంటప్పుడు తెలియజేసిన సమస్యల పరిష్కారంలో అధికారుల తీరును చూస్తే మమ్మల్ని మేమే హేళన చేసుకున్నట్లుందని అసహనం వ్యక్తం చేశారు. అక్టోబరులో జూనియర్ కళాశాల మైదానంలో లైట్లు ఏర్పాటు చేయాలని చెప్పగా ఇప్పటివరకు వేయకపోవడంపై వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఏఈకి చెప్పాన్నారు. ఏఈ మాట్లాడుతూ చేస్తాం సార్.. చేస్తాం సార్ అంటూ దాటవేశారు. దీంతో సభ్యులంతా వారి తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ సమావేశంలో అధికారుల తీరు ఇలాగే ఉంటుందని కౌన్సిలర్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ మాట్లాడుతూ ఇది సరైన పద్ధతి కాదని, పనులపై డీఈగా మీ అజమాయిషీ ఉండాలిగా అని నిలదీశారు. ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, వెంటనే ఈ రోజే జూనియర్ కళాశాల మైదానంలో లైట్లు వెలగాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం, శివాజీ చౌక్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు పూర్తి చేయించాలని వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చి పనులు రద్దు చేయాలని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో అన్నారు. ఐడీఎస్ఎంటీ ఫేస్-2 స్థలాలు ఇంకెన్నాళ్లకు అందజేస్తారని కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. పారిశుధ్య వాహనం పాడై 17 రోజులవుతున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయించలేదని కౌన్సిలర్ జయరాజ్ అన్నారు. హరితహారం లేబర్ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని, డివైడర్ మధ్యలో తొలగించిన పిచ్చి మొక్కలను అలాగే ఉంచుతున్నారని సమావేశంలో ప్రస్తావించారు. మార్కెట్ ప్రాంతంలో రహదారులపైనే కూరగాయలు అమ్ముతూ.. మిగిలిన వాటిని మురుగు కాలువల్లో వేస్తున్నారని, నియంత్రించాలని కౌన్సిలర్ మేఘమాల కోరారు. చైర్మన్ మాట్లాడుతూ నిర్లక్ష్యపు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, సమావేశాల్లో కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలకు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చైర్మన్ ఆదేశించారు. ప్రజాపాలన సంబరాల్లో ఎనిమిల్‌కేర్ సెంటర్, రైతుబజార్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మహేష్‌కుమార్‌తో పాటు కౌన్సిలర్లు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బొల్లారం మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం: ఎంపీ

జిన్నారం, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో సమస్యలను పరిష్కరిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడారు. పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావాలని, పెండింగ్‌లో ఉంచిన 2,500 నల్లా కలెక్షన్లను మంజూరీ చేయాలన్నారు. కాగా పాలకవర్గం విజ్ఞప్తి మేరకు ఈఎస్ఐ ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు, డంపింగ్ యర్డు, నూతన అంగన్‌వాడీ కేంద్రాల మంజూరుకు ప్రతిపాదనలు పంపితే అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాగా సమావేశంలో రూ.75 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం : ఎమ్మెల్యే



ఖేడ్‌లో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం పనిచేసేది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రైతు పండుగ సభకు డివిజన్ పరిధిలోని 150 మంది రైతులు బస్సుల్లో తరలి వెళ్లడంతో, నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే జెండా ఊపి బస్సులను ప్రారంభించి సాగనంపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ నూతన్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. శాసనమండలి ఎన్నికల కోసం ఖేడ్ నియోజకవర్గంలోని పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. శనివారం ఆయన ఖేడ్‌లో విలేకరులతో మాట్లాడారు. అలాగే అల్లాదుర్గం, నర్సాపూర్, రామాయంపేట, వట్‌పల్లి, వెల్దుర్తి తదితర మండలాల నుంచి రైతులు బయలుదేరి వెళ్లారు.

7 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు: సంగారెడ్డి కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీలు డిసెంబర్ 7 నుంచి నిర్వహించనున్నట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో పోటీలు, 10 నుంచి 12 వరకు మండలస్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లాస్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి పోటీలకు విస్తృత ప్రచారం చేయాలని మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. మండలంలో యువజన సంఘాలు, మహిళా సంఘాలు సభ్యులను క్రీడాపోటీల్లో భాగస్వాములను చేయాలని, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, మహిళా క్రీడాకారులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రజాప్రతినిధులను క్రీడా పోటీలకు ఆహ్వానించాలన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు వచ్చేలా క్రీడా పోటీలు నిర్వహించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. అనంతరం సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో కెనరా బ్యాంకు 18వ శాఖను శనివారం కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు.

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు: మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఈనెల 9 వరకు జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ ప్రజా విజయోత్సవాల్లో భాగంగా అన్ని మండల కార్యాలయాల్లో ప్రభుత్వ లోగో ఏర్పాటు, విద్యుత్ దీపాలతో అలంకరణ చేయాలని, పరిశుభ్రతను పాటించాలన్నారు. డిసెంబర్ 7,8,9 తేదీల్లో గ్రామస్థాయిలో, 10,11న మండల, 16 నుంచి 21వ వరకు జిల్లాస్థాయి సీఎం కప్ ఆటల పోటీలను నిర్వహించాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, డీపీవో యాదయ్య, డీఎంహెచ్‌వో డా. శ్రీరామ్, డీఈవో రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన

జహీరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో మూడురోజులుగా ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. మూడోరోజైన శనివారం వారు మహీంద్రా అండ్ మహీంద్రా కర్మాగారంలో తిరిగి అక్కడ జరుగుతున్న ఉత్పత్తి ప్రక్రియ, తదితరాలను పరిశీలించారు. అనంతరం కర్మాగారం ముఖ్య అధికారులతో సమావేశమై కర్మాగారంలో కొనసాగుతున్న ఉత్పత్తి, కార్మికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 30 పోలీసు చట్టం అమలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం డిసెంబరు 1 నుంచి 31వ తేదీవరకు 30, 30(ఎ) పోలీసుచట్టం (1861) అమలులో ఉంటుందని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించొద్దని హెచ్చరించారు. అలాగే మైకులు పెట్టుకొని తిరగడం వంటివి చేయొద్దని చెప్పారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణతోపాటు పోలీసులు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో వాలీబాల్ కోర్టును ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడితో విధులకు హాజరయ్యే పోలీసులకు మానసిక ప్రశాంతతకు క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలను వివరిస్తున్న యూఎస్ఎఫ్ఐ నాయకులు

సంగారెడ్డి రూరల్/నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్ఎఫ్ఐ నాయకులు ఇచ్చిన పిలుపునకు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. దీంతో శనివారం జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం పెట్టనందు వల్ల విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, ప్రశాంత్, దుర్గాప్రసాద్, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యాసంస్థల్లో నెలకొంటున్న ఫుడ్‌పాయిజన్‌పై ప్రభుత్వం స్పందించాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. శనివారం ఈ విషయమై నారాయణఖేడ్‌లో విద్యాసంస్థలు బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ అశోక్ మాట్లాడారు.

శాస్త్ర విజ్ఞానం వైపు ప్రోత్సహించాలి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- ముగిసిన సైన్స్ పండుగ
- రాష్ట్రస్థాయి పోటీలకు 19 ఎగ్జిబిట్ల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన సిద్దార్థ స్కూల్ విద్యార్థి శ్రీకర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న రఘునందన్‌రావు, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి

మెదక్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలోనే పిల్లలకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం వైపు ప్రోత్సహించాలని, ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వెస్లీ ఉన్నత పాఠశాలలోని అబ్దుల్‌కలాం ప్రాంగణంలో రెండురోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ముగిసింది. ముగింపునకు ఎంపీ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందని, దాని మూలంగా రకరకాల అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 19 ఎగ్జిబిట్ల ఎంపిక

జిల్లాలోని 21 మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మొత్తం 392 ప్రదర్శనలు నిర్వహించగా.. దాదాపు 7 వేలమంది విద్యార్థులు తిలకించారు. జిల్లా నుంచి సీనియర్ విభాగంలో 7, జూనియర్ విభాగంలో 7, ఇన్‌స్పైర్ 4, టీచర్స్ ఎగ్జిబిట్ 1 మొత్తం 19 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఉత్తమ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులకు ఎంపీ రఘునందన్‌రావు, డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రాష్ట్రస్థాయికి మాసాయిపేట విద్యార్థిని

మాసాయిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మాసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని దుంపల సిరి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ధర్మపురి తెలిపారు.

వెంకట్‌రావుపేట పాఠశాల హ్యాట్రిక్

అల్లాదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మెదక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న అల్లాదుర్గం మండలం వెంకట్రావుపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జూనియర్ విభాగంలో సంగమేశ్వర్, శివకుమార్ ప్రతిభచాటి ద్వితీయ బహుమతి సాధించారు. వరుసగా మూడుసార్లు ప్రతిభచాటి బహుమతులు పొందారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ చేతులమీదుగా ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

గీతా స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

తూప్రాన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని గీతా హైస్కూల్‌లో శనివారం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులు వివిన్న ప్రక్రియల్లో తయారు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సైన్స్, కంప్యూటర్లకు సంబంధించిన ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా విద్యాలయంలో ఆర్డీవో తనిఖీ

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు అందులోనే కొనసాగుతున్న నాగల్‌గిద్ద మండలానికి సంబంధించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్థానిక ఆర్డీవో అశోకచక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. అలాగే పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఎస్ఐ శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట పేట ఏఎస్ఐ సునీత, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తనిఖీ

నర్సాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, మంతూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం డీఆర్‌డీఏ అదనపు పీడీ సరస్వతి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, ఏపీఎం గౌరీశంకర్‌తో కలిసి తనిఖీ చేశారు.

చాముండేశ్వరీని దర్శించుకున్న మేడ్చల్ జడ్జి

చిలప్‌చెడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆలయంగా ప్రసిద్ధిగాంచిన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ వద్ద మంజీరానది సమీపంలో వెలసిన చాముండేశ్వరీ ఆలయాన్ని శనివారం మేడ్చల్ జడ్జి అర్జున్ కుటుంబసమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు జడ్జి కుటుంబీకులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

అల్లాదుర్గం పీఆర్ డిప్యూటీ ఈఈగా అమరేశ్వర్

అల్లాదుర్గం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ అల్లాదుర్గం డివిజన్ డిప్యూటీ ఈఈగా అమరేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిసింది. స్థానిక డిప్యూటీ ఈఈగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆయనస్థానంలో కొడిపల్లి డిప్యూటీ ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న అమరేశ్వర్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వైద్యం కోసం ఎల్వోసీ అందజేత

మనోహరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన వడ్ల దయానందచారి ఆరోగ్యం బాగాలేదు. చికిత్స నిమిత్తం సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. ఆయన చికిత్స నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు.

మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలో రాంమందిర్ ఆవరణలోని అయ్యప్పస్వామి సన్నిధాన సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 50 మంది యువకులు తరలివచ్చి రక్తాన్ని దానం చేశారు. ఖేడ్ ఏరియా వైద్యశాలలోని రక్త నిల్వ కేంద్రం నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు.

ఉచిత వైద్య శిబిరం

మెదక్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిమ్మానగర్, భూపతిపూర్ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మెడిసిటీ హాస్పిటల్, మేడ్చల్ రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు 1000 మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ శాఖ చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి లయన్ సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు. మక్తా భూపతిపూర్ గ్రామస్థుడు మహ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

'మానవ మనుగడకు మొక్కలు నాటాలి'

చిన్నశంకరంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్ అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్యార్థులు మొక్కలు నాటారు.

'సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి'

అల్లాదుర్గం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మెస్సెంజర్స్ అధ్యక్షుడు బసన్నగారి రమేష్, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల వనరుల కేంద్రం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన చేపట్టారు. అలాగే చేగుంటలో చేగుంట, నార్సింగ్ ఉద్యోగులు మండల వనరుల కేంద్రం వద్ద, కౌడిపల్లిలో మండల వనరుల కార్యాలయం ఎదుట, నర్సాపూర్, మనోహరాబాద్‌లో ఎంఈవో కార్యాలయాల ఎదుట, తూప్రాన్‌లో మండల వనరుల కేంద్రం వద్ద, వెల్దుర్తి, పాపన్నపేటలో ఎమ్మార్సీ కార్యాలయాల ఎదుట, శివ్వంపేట, టేక్మాల్‌లో ఎంఈవో కార్యాలయాల ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన చేపట్టారు.

కార్పొరేట్ వసతులు.. కానరాని డాక్టర్లు

ఐదో పేజీ తరువాయి



రోగులకు సౌకర్యంగా రూపుదిద్దుకున్న ఆస్పత్రి వెలుపలి దృశ్యాలు

రోగులకు మెరుగైన చికిత్స అందించ లేని పరిస్థితి ఏర్పడింది. పడకల సంఖ్య, రోగుల తాకిడిని బట్టి ఇక్కడ ముగ్గురు గైనకాలజిస్టులు, ఇద్దరు పిల్లల వైద్యులు, ఒక సర్జన్, ఆర్థోపెడిక్, అనస్థీషియా, జనరల్ ఫిజీషియన్లు భర్తీ చేయాల్సి ఉంది. కొత్తవారిని నియమించకపోగా ఇక్కడ ఉన్న డాక్టర్లనే ఇతర ప్రదేశాలకు బదిలీ చేస్తున్నారు.

రోగులు రాకపోవడంతో..

రామాయంపేట ఆసుపత్రిని ప్రతీ రోజు 600 మంది అవుట్‌పేషెంట్లు వచ్చినా వైద్యం అందించే స్థాయిలో నిర్మించారు. కానీ, వైద్యులు లేకపోవడంతో ప్రస్తుతం 150 నుంచి 180 మంది రోగులు మాత్రమే వస్తున్నారు. అత్యవసర సమయంలో రోగులకు ఆక్సిజన్ అందించే యంత్రం, అధునాతన ఎక్స్‌రే పరికరం, ఐసీయూ సౌకర్యాలు ఉన్నా వినియోగించకపోవడంతో మూలనపడ్డాయి. అలాగే, ఇన్‌పేషెంట్లు చేరకపోవడంతో మంచాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

హనుమాన్ ఆలయాల్లో భక్తుల కిటకిట

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ ప్రాంతంలోని పలు హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకమాసం చివరి శనివారం కావడంతో కొండాపూర్ హనుమాన్, దోపూరు లొంక హనుమాన్ ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండాపూర్‌లో ఉదయం అభిషేకం, చందనం, మహాహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ భక్తులకు ఆశీస్సులు అందించారు.

భక్తజన సందోహంగా చాకరిమెట్ల

శివ్వంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామం చాకరిమెట్ల అరణ్యంలో స్వయంభుగా వెలసిన పుణ్యక్షేత్రం సహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు బారులుతీరారు. ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన పూజారి దేవదత్తశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు కొత్తపల్లికి చెందిన ప్రభాకర్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా జిన్నారం రంగనాయకస్వామి గుట్టపై శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. గుట్టపై వెలసిన రంగనాయకులస్వామికి ప్రత్యేక పూజలు, వ్రతాల నిర్వహణలో స్థానిక భక్తులు, నాయకులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాచన్నస్వామి సన్నిధిలో వనభోజనాలు



చేగుంటలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

కోహీర్/జహీరాబాద్/చేగుంట/నర్సాపూర్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని బడంపేటలో గల రాచన్నస్వామి ఆలయం వద్ద శనివారం కార్తీకమాస వనభోజనాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహారుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చనలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా రెండోరోజైన శనివారం వనభోజనాలు నిర్వహించారు. చేగుంట మండల కేంద్రంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయితపరంజ్యోతి కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో శనివారం కార్తీక దీపోత్సవం, వన భోజనాలు నిర్వహించారు. నర్సాపూర్ ఆర్టీసీ డిపోలో కార్మికులు తమ కుటుంబీకులతో కలిసి కార్తీ వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సురేఖ, సీఐ వీరబాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పరిశ్రమలకు జరిమానా

జిన్నారం, నవంబరు, 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని రెండు పరిశ్రమలకు జరిమానా విధించినట్లు పీసీబీ ఈఈ కుమార్ పాఠక్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ జిన్నారం మండలం గడ్డపోతారం పరిధిలోని లీ ఫార్మా పరిశ్రమ కాలుష్య జలాలను బహిరంగ ప్రాంతంలో వదిలేస్తుందని ఇటీవల స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులపై విచారణ జరిపి లీ ఫార్మాకు రూ.8 లక్షల జరిమానా, రూ.24 లక్షల బ్యాంకు గ్యారంటీ విధిస్తూ పీసీబీ ఎమ్మెస్ ఆదేశాలు జారీచేశారని తెలిపారు. అదేవిధంగా గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రాన్యూల్స్ పరిశ్రమకు రూ.8 లక్షల జరిమానా, రూ.24 లక్షల బ్యాంకు గ్యారంటీ విధించినట్లు ఈఈ తెలిపారు.

అబ్బెంద పాఠశాలలో ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

నారాయణఖేడ్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టసభల పట్ల అవగాహన కల్పించడానికి శనివారం మండల పరిధిలోని అబ్బెంద ఉన్నత పాఠశాలలో మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్పీకర్ పాత్రతోపాటు మంత్రులు, సీఎం, శాసనసభ్యుల పాత్రలను చక్కగా నిర్వహించి, పరిపాలన విధానంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయుడు శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాక్ అసెంబ్లీలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.కిషన్‌రావు అభినందించారు.

యావాపూర్‌లో సివిల్ రైట్స్ డే

తూప్రాన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం యావాపూర్ శనివారం సివిల్స్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో జయచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పౌరహక్కుల విషయం వివరించి, గ్రామస్థులను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ శేరి నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ యంజాల స్వామి పాల్గొన్నారు.

ఎస్ఐకి బీజేపీ నాయకుల సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన మధుకర్‌రెడ్డిని బీజేపీ మండలాధ్యక్షుడు పెద్దపులి రవి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి దర్శన్, మండల ఉపాధ్యక్షుడు వినోద్, బీజేవైఎం మండలాధ్యక్షుడు భాస్కర్, బూత్ అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

తూప్రాన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో శనివారం విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, పెయింటింగ్, రంగోలి పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభచూపిన విద్యార్థులను కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు సాజిద్, సాయి, స్నేహలు గుర్తించగా, బహుతులు అందజేశారు. జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.